క్లుప్తంగా

చిన్నారులకు రోగనిరోధక టీకాలు


చిన్నారికి టీకా వేస్తున్న ఏఎన్ఎం అరుణకుమారి

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో శనివారం ఒకటవ గ్రామ సచివాలయంలో ఏఎన్ఎం అరుణకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ ప్రభావతి చిన్నారులకు రోగనిరోధక టీకాలు వేశారు. చిన్నారుల పోషణపై తల్లులకు సూచనలు చేశారు. ఆరుగురు బాలుర, 11 మంది బాలికలకు పోలియో, న్యూమోనియా, తట్టు, మెదడువాపు తదితర వ్యాధుల నివారణకు టీకాలు వేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు ఉషారాణి, లత, జ్యోతి, జమీల్‌బీ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

కల్లూరు: రీ సర్వేలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ శివరామ్ సూచించారు. మండల పరిధిలోని బస్తిపాడు గ్రామంలో శనివారం డీటీ గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి, ఎంపీటీసీ నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

కర్నూలు న్యూసిటీ: నగరంలోని 4వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ముగ్గురిపై కేసు నమోదైంది. కల్లూరు శేషన్న నగర్‌కు చెందిన బాధితురాలు విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు నగరానికి చెందిన రామలక్ష్మి, రామాంజనేయులు, బాలసుందరంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అప్పు విషయంలో నిందితులు ఎస్సీ, ఎస్టీ కేసు పెడతామని బెదిరించి, దూషించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

మద్దూరులో రెవెన్యూ సదస్సు

పాణ్యం: రీ సర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి శనివారం మండల పరిధిలోని మద్దూరులో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డీటీ శివశంకర్‌రెడ్డితో కలిసి రైతుల నుంచి వినతులు స్వీకరించిన తహసీల్దార్ పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు.

9న రాష్ట్రస్థాయి పెంటథ్లాన్ పోటీలు

కర్నూలు (టౌన్): శ్రీకాకుళం జిల్లాలోని ప్రభుత్వ డీగ్రీ కళాశాలలో ఈ నెల 9, 10 తేదీల్లో అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి మోడ్రన్ పెంటాథ్లాన్ బాల బాలికల పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్.గిడ్డయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

5న సీపీఐ జిల్లా సమితి సమావేశం

కర్నూలు(సెంట్రల్): సీపీఐ జిల్లా సమితి సమావేశాన్ని నవంబర్ 5వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య హాజరవుతారని వెల్లడించారు. ఈ సమావేశంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

నగరంలో మంత్రి పర్యటన

కర్నూలు (టౌన్): నగరంలోని 1వ డివిజన్‌లో శనివారం రాత్రి రాష్ట్ర మంత్రి టీజీ భరత్ పర్యటించారు. ఖండేరి వీధిలో స్థానికులతో మాట్లాడారు. సమస్యల గురించి ఆరా తీశారు. మంచి నీటి సమస్యతో పాటు వీధిలైట్లు, డ్రైనేజీ, రోడ్లు తదితర సమస్యల గురించి కాలనీవాసులు మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ మాట్లాడుతూ.. కర్నూలు నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. కమిషనర్ రవీంద్రబాబు, ఎస్ఈ రాజశేఖర్, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక

కర్నూలు కల్చరల్: కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి కర్నూలు నగరానికి చెందిన ఆర్జా రామకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కర్నూలు నగర బలిజ సంఘం నాయకులు శనివారం నగరంలోని స్వగృహంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. నగర సంఘం కార్యవర్గ సభ్యులు పత్తి ఓబులయ్య, శైలేష్, అమర్, శేషు, సంగా ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కర్నూలు(సెంట్రల్): పరిశుభ్రత పాటించకపోతే చర్మవ్యాధులు ప్రబలుతాయని ప్రముఖ చర్మవ్యాధి నిపుణుడు డాక్టర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. చర్మవ్యాధుల నిర్మూలనపై ఆయన అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సేవలు అంతేనా!

- గ్రామ సచివాలయాల్లో నిలిచిపోయిన సేవలు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- ప్రైవేట్ కేంద్రాలకు పెరిగిన డిమాండ్

సి.బెళగల్: టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల వద్దకే పాలనే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన సచివాలయాల సేవలు ఒక్కొక్కటిగా మరుగున పడుతున్నాయి. కూటమి సర్కార్ ఉద్దేశపూర్వకంగానే సచివాలయాల ప్రాతినిధ్యాన్ని తగ్గిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు సచివాలయాల్లో నిలిచిపోయిన ఆధార్ సేవలు ఊతమిస్తున్నాయి. ప్రజలకు నేరుగా సేవలు అందజేసేందుకు గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ఈ మేరకు సి.బెళగల్ మండలంలో 16 గ్రామ సచివాలయాలు ఏర్పాటయ్యాయి. మండల కేంద్రాలకు వెళ్లకుండా ఉన్న ఊళ్లలోనే ప్రజలు అన్ని సేవలు అందేవి. ఈ నేపథ్యంలో ప్రజలకు నిత్యం ఆధార్ సేవలు అందజేసేందుకు మండల కేంద్రం సి.బెళగల్ - 1, పోలకల్ - 2, ముడుమాల గ్రామ సచివాలయాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసింది గత ప్రభుత్వం. ఈ మూడు కేంద్రాల్లో ప్రజలకు ఆధార్ సేవలకు అందేవి. ఆధార్‌కు ఫోన్ లింక్, తప్పొప్పుల సవరణ, ఈకేవైసీ తదితర సమస్యలు ఈ మూడు సచివాలయాల్లో పరిష్కారమయ్యేవి. ప్రస్తుతం ఆ సేవలు అందడం లేదు. సమస్య ఏదైనా ప్రజలకు మాత్రం ఆధార్ సేవలు మాత్రం అందడం లేదు. నెలల తరబడి ఆధార్ సేవలు నిలిచిపోయినా పట్టించుకోని అధికారుల తీరును ప్రజలు తప్పుపడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రైవేట్ ఆధార్ కేంద్రాలకు డిమాండ్ పెరిగింది.



సి. బెళగల్ ఒకటవ సచివాలయంలో ఖాళీ కుర్చీ దర్శనమిస్తున్న దృశ్యం, ఓ ప్రైవేట్ ఆధార్ కేంద్రం దగ్గర గుమిగూడిన జనం

నాలుగు నెలలుగా నిలిచిపోయిన ఆధార్ సేవలు

పోలకల్ సచివాలయంలో నాలుగు నెలలుగా ఆధార్ సేవలు నిలిచిపోయాయి. సాంకేతిక సమస్యలతో ఆధార్ సేవలు నిలిచిపోయాయని అధికారులు చెబుతున్నా నెలల తరబడి పట్టించుకోని తీరును ప్రజలు తప్పుపడుతున్నారు. ముడుమాల సచివాలయంలోనూ ఆధార్ సేవలు అందడం లేదు. ఆధార్ సేవల విధులు నిర్వహించే ఉద్యోగిని ఇసుక రీచ్‌కు అటాచ్ చేయడంతో ఈ సమస్య నెలకొంది. ఈ ఉద్యోగి ఇసుక్ రీచ్‌లో విధులు నిర్వర్తిస్తుండడంతో ఆధార్ సేవలు అందజేయలేని పరిస్థితి. అయితే ప్రత్యామ్నాయంపై అధికారులు దృష్టి సారించకపోవడం గమనార్హం. అదేవిధంగా మండల కేంద్రం సి.బెళగల్ ఒకటవ సచివాలయానికి సంబంధించి గత నెలలో సాంకేతిక సమస్యను పరిష్కరించి ఆధార్ సేవలు పునరుద్ధరించారు. అయితే ఆధార్ విధులు నిర్వర్తించే ఉద్యోగి సెలవులపై వెళ్లడంతో మరోసారి సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

విద్యార్థుల సమస్యలు వర్ణనాతీతం

విద్యార్థులకు సంబంధించి ప్రస్తుతం ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) కార్డుల నమోదు ప్రక్రియ సాగుతోంది. అయితే అపార్ నమోదులో విద్యార్థులు పట్టిన తేదీతో పాటు, పేరు, చిరునామ, తల్లిదండ్రుల పేర్లు పక్కాగా ఉండాల్సి ఉంది. చిన్న పొరపాటు ఉన్నా అపార్ ప్రక్రియ ముందుకు సాగదు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఆధార్ కార్డులలో మార్పులు చేయించుకోవాలని పంపిస్తున్నారు. ప్రభుత్వ ఆధార్ సేవలు అందుబాటులో లేకపోవడంతో గ్రామీణ విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తప్పుల సవరణకు విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఆధార్ క్యాంప్‌లను పర్యవేక్షించాల్సిన మండల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సమస్యలు పరిష్కారం కావడంలేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆకాశదీప దర్శనం.. పుణ్యప్రదం

గడివేముల: కార్తీక మాసంలో శివాలంలో ఏర్పాటు చేసే ఆకాశదీపాన్ని దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలమని భోగేశ్వరాలయ ప్రధానా ర్చకులు శ్యాంసుందర్ శర్మ తెలిపారు. కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా శని వారం దక్షిణకాశీగా పేరుగాంచిన దుర్గాభోగే శ్వరాలయంలో ఆకాశదీపాన్ని ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కార్తీక దీపాలు వెలిగించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులకు గడిగరేవుల గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ రామానుజన్, సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.

గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దుతాం

కల్లూరు: గుంతల లేని రోడ్లుగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా కల్లూరు అర్బన్ పరిధిలోని నంద్యాల చెక్‌పోస్టు మెయిన్ రోడులో ఆర్అండ్‌బీ అధికారులతో కలసి ఎమ్మెల్యే గుంతలు పూడ్చే కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంతలు పడిన ప్రతిరోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రైతుల ఆత్మహత్యలు పట్టని ప్రభుత్వం

- రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇవ్వాలని కోరుతూ 4న నిరసనలు
- సీపీఐ కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య


మాట్లాడుతున్న రామచంద్రయ్య

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదని, వ్యవసాయం సంక్షోభంలో పడిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సీఆర్ భవన్‌లో ఏపీ రైతు సంఘం జిల్లా స్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం గిట్టుబాటు గాక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, కొందరు ఇతరరంగాల వైపు మళ్లుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర రావడం లేదన్నారు. గిట్టుబాటు ధర కల్పించేలా చట్టం చేయాలని కోరితే పట్టించుకోవడం లేదని వాపోయారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులైన గుండ్రేవుల, వేదవతిని పూర్తిచేయాలన్నారు. దేవనకొండ మండలంలో యురేనియం తవ్వకాలు చేపడితే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం తక్షణమే ఇవ్వాలని కోరుతూ సోమవారం అన్ని గ్రామ సచివాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. నాయకులు కె.జగన్నాథం, తిమ్మయ్య, జయలక్ష్మారెడ్డి, నాగేంద్రయ్య, పంపన్నగౌడ్ పాల్గొన్నారు.

10న స్విమ్మింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): రాజమండ్రిలోని మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌లో ఈనెల 10వ తేదీన 7వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీలను నిర్వహించనున్నట్లు రాష్ట్ర మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.లక్ష్మీనారాయణ రెడ్డి వెల్లడించారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్ పూల్ వద్ద పోస్టర్ల ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీల్లో పాల్గొనే మాస్టర్స్ స్విమ్మర్స్ ఈ నెల 5వ తేదీలోపు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులు వచ్చే డిసెంబర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. బుచ్చన్న, సుధాకర్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సదీప్ కుమార్


హాజరైన నోడల్ ఆఫీసర్లు, వైద్యాధికారులు

- స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలి
- కర్నూలు ఆర్‌డీఓ సందీప్‌కుమార్

కర్నూలు (రూరల్) : లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని కర్నూలు ఆర్‌డీఓ సందీప్ కుమార్ సూచించారు. గర్భస్థ లింగ నిర్ధారణపై మాటలు, సైగలు చేసినా నేరమని, ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే పీసీ, పీఎన్‌డీటీ చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం ఆర్‌డీఓ కార్యాలయంలో పీసీ అండ్ పీఎన్‌డీటీ సబ్ డిస్ట్రిక్ట్ లెవల్ కమిటీ మీటింగ్ ఆర్‌డీఓ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో డివిజన్ కమిటీ చైర్మన్, ఆర్డీఓ మాట్లాడుతూ ఆడ శిశువులను గర్భంలోనే తుడిచివేయడం క్షమించరాని నేరమన్నారు. సబ్ డిస్ట్రిక్ట్‌లో ఉండే స్కానింగ్ సెంటర్లు కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకున్న వాటిని ప్రోగ్రాం ఆఫీసర్ తనిఖీలు చేయాలని ఆదేశించారు. పత్రాలు సరిగా ఉన్నాయా లేదా తదితర విషయాలను పూర్తిగా పరిశీలించాలన్నారు. ఇన్‌స్పెక్షన్ రిపోర్టులను జిల్లాస్థాయి కమిటీకి సమర్పించి ఆమోదం పొందాలన్నారు. డివిజన్‌లో ఉన్న స్కానింగ్ సెంటర్లను సబ్ డిస్ట్రిక్ట్ కమిటీ సభ్యులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. జూనియర్ కళాశాల, పాఠశాలలో ఆడపిల్లల ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ ఆఫీసర్ పీసీ, పీఎన్‌డీటీ డాక్టర్ వై.నాగప్రసాద్ బాబు, గైనకాలజిస్టు డాక్టర్ సంధ్య, డెమో శ్రీనివాసులు, ఎస్ఐ సోమశేఖర్, డివిజనల్ పీఆర్వో శివకుమారయ్య, ఎన్‌జీఓలు రాయపాటి శ్రీనివాసులు, మద్దిలేటి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకు ట్రేడ్ లైసెన్సు తప్పనిసరి

- నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ


శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షిస్తున్న అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో వందల సంఖ్యలో అనధికార ట్రేడ్ లైసెన్సులు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోకుండా కొంత మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వసూళ్లు చేసుకుంటున్నారని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. త్వరలో అన్ని డివిజన్లలో సచివాలయాల ఉద్యోగులతో పూర్తిస్థాయిలో సమీక్ష, సర్వే చేయిస్తామని స్పష్టం చేశారు. శనివారం స్థానిక నగరపాలకలోని తన చాంబర్‌లో ఆరోగ్య శాఖతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో వాణిజ్య సంస్థలు, వ్యాపారులు తప్పనిసరిగా నగరపాలక సంస్థ నుంచి ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలన్నారు. ట్రేడ్ లైసెన్సును పునరుద్ధరించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికీ నగరపాలక పరిధిలో వందల సంఖ్యలో అనధికారికంగా వ్యాపారాలు చేసుకుంటూ నగరపాలక సంస్థకు ట్రేడ్ లైసెన్సు చెల్లించడం లేదన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ల జేబుల్లోకి వెళుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. పెద్ద సంఖ్యలో ట్రేడ్ లైసెన్సుల బకాయిలు ఉన్నాయని, వంద శాతం వసూలు చేయాల్సిన బాధ్యత శానిటరీ ఇన్‌స్పెక్టర్లదే అని చెప్పారు. నగరపాలక ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, సూపరింటెండెంట్లు స్వర్ణలత పాల్గొన్నారు.

కేఎంసీ ప్రైడ్ కాంప్లెక్స్ తనిఖీ

కర్నూలు (టౌన్): నగరంలోని వెంకటరమణ కాలనీలో గతేడాది నూతనంగా నిర్మించిన నగరపాలక సంస్థకు చెందిన కేఎంసీ ప్రైడ్ వాణిజ్య సముదాయాన్ని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ శనివారం తనిఖీ చేశారు. కాంప్లెక్స్‌లో మరమ్మతు పనులు పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన ఈ కాంప్లెక్స్‌లో ఇప్పటివరకు 20 షాపులు బహిరంగ వేలం ద్వారా పాటదారులకు కేటాయించామన్నారు. మరో 30 మంది షాపుదారులు పాటపాడి షాపులు దక్కించుకున్నారన్నారు. చిన్న చిన్న పనులు పూర్తి చేసి షాపులు దక్కించుకున్న వారికి అన్ని విధాలా సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే షాపులను వేలం ద్వారా వ్యాపారులకు కేటాయించి నగరపాలక రెవెన్యూ పెంచే దిశగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. రెవెన్యూ ఆఫీసర్ జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తిప్పన్న పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఆర్‌యూ అభివృద్ధి

కర్నూలు కల్చరల్: అందరి సహకారంతో రాయలసీమ విశ్వవిద్యాలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్‌కుమార్ నాయుడు పేర్కొన్నారుం వర్సిటీలోని వీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్సిటీ పాలనను గాడిలో పెట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వసతి గృహాల్లో నీటి సమస్యను పరిష్కరించేందుకు వీసీ ఆదేశాలతో బోర్లను బాగు చేయించినట్లు చెప్పారు. రానున్న వేసవిలో నీటి కొరత తలెత్తకుండా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో పాటు, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో చర్చిస్తున్నామన్నారు. వర్సిటీ పరిధిలో వివిధ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు సరైన సమయంలో పరీక్షల నిర్వహణకు, ఫలితాల ప్రకటన, సర్టిఫికెట్ల జారీకి సంబంధిత విభాగాలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ర్యాగింగ్‌ను పూర్తిగా నియంత్రించేదుకు కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

అనవసర సిజేరియన్లపై చర్యలు తీసుకోవాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏపీ మహిళా సమాఖ్య సభ్యులు

కర్నూలు(సెంట్రల్): అవసరం లేకున్నా డబ్బుల కోసం సిజేరియన్ ఆపరేషన్లు చేస్తున్న ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గిడ్డమ్మ, పి.శ్రావణి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట ఏపీ మహిళా సమాఖ్య, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్నూలులో వీధికో ప్రైవేట్ ఆసుపత్రి ఉండడంతో చికిత్స కోసం వెళ్లిన వారికి అవసరంలేని పరీక్షలన్నీ చేసి దోచుకుంటున్నారని విమర్శించారు. గర్భిణులు కాన్పు కోసం వెళితే సిజేరియన్ తప్పా సాధారణ కాన్పులు చేయడం లేదని ఆరోపించారు. సిజేరియన్ అవసరం లేకున్నా కేవలం డబ్బు కోసమే ఆసుపత్రుల యాజమాన్యాలు ఇలా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు జిల్లాలో విచ్చలవిడిగా గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు కళ్లు మూసుకొని మామూళ్లకు అలవాటుపడ్డారని విమర్శించారు. నాయకులు ఆశాబేగం, శైలజ, సుశీలమ్మ, సులోచనమ్మ, వెంకటేశ్వరమ్మ, పావని పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషిచేస్తానని డీఈఓ శామ్యూల్‌పాల్ హామీ ఇచ్చారు. శనివారం ఏపీఎన్‌జీఓ చైర్మన్ వీసీ వెంగళరెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు డీఈఓను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని డీఈఓ సూచించారు. నాయకులు దస్తగిరిరెడ్డి, ఎం,కాశన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం

కర్నూలు(సెంట్రల్): విద్యార్థి దశలో ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కర్నూలు డీఎస్పీ జె.బాబుప్రసాద్ సూచించారు. శనివారం ఏ క్యాంపులోని మైపర్ ఫార్మసీ కళాశాలలో ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ హాజరై ర్యాగింగ్ చట్టాలను వివరించారు. జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్ ఉండదని, విద్యార్థులు ఫ్రెండ్లీ నేచర్‌తో కలిసిమెలసి ఉండాలని కళాశాల డైరెక్టర్ ఆదిమూలపు సతీష్ సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కాకర్ల సురేష్, అకాడమిక్ డీన్ డాక్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ బాబు ప్రసాద్

మార్కింగ్ పనుల పరిశీలన


ఏపీఎస్‌పీ క్యాంపు వద్ద పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): స్థానిక ఏపీఎస్‌పీ క్యాంపు వద్ద రహదారి నిర్మాణానికి సంబంధించి మార్కింగ్ పనులను శనివారం నగరపాలక కమిషనర్ సొంగ రవీంద్రబాబు పరిశీలించారు. బళ్లారి చౌరస్తా వద్ద ట్రాఫిక్ నియంత్రణ పనులు చేపట్టేందుకు ఏపీఎస్‌పీ క్యాంపు అదనపు కమాండెంట్ మహబూబ్‌బాషా, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్‌తో కమిషనర్ చర్చించారు. కమిషనర్ మాట్లాడుతూ.. బళ్లారి చౌరస్తా సమీపంలోని ఏపీఎస్‌పీ క్యాంపు మీదుగా కొత్త రహదారి నిర్మాణానికి సంబంధించి మార్కింగ్ పనులు చేపడుతున్నామన్నారు. హైదరాబాదు నుంచి వచ్చే వాహనాలను చౌరస్తా సమీపంలోని ఏపీఎస్‌పీ క్యాంపు మీదుగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోకి మళ్లించేలా రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే టీచర్స్ కాలనీలో కమ్యూనిటీ హాలు, వెంకటేశ్వర వెంచర్ సమీపంలో రహదారి నిర్మాణానికి సంబంధించిన పనులను పరిశీలించారు.

నేడు ఉపకార వేతనాల పంపిణీ

కర్నూలు కల్చరల్: గుంటూరు 'కృష్ణ దేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్', కర్నూలు రోపా సంయుక్త ఆధ్వర్యంలో చదువులో ప్రతిభ కనబరిచిన 160 మంది పేద విద్యార్థులకు రూ.7.50 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు తులసి గ్రూప్ ప్రతినిధులు తెలిపారు. ఇందులో రూ.3.75 లక్షలు తులసి సీడ్స్ వారు కృష్ణ దేవరాయ సంస్థ ద్వారా ఉపకార వేతనాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక రావూరి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని తెలిపారు.

సాధనతోనే విజయం

కర్నూలు (టౌన్): నిత్య సాధన, కృషి, దీక్ష ఉంటేనే క్రీడల్లో పతకాలు సాధ్యమని సెట్కూర్ విశ్రాంత సీఈఓ రమణ అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రోలర్ స్కేటింగ్ పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కేటింగ్ క్రీడ చక్కటి వ్యాయామంగా ఉపయోగపడుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను స్కేటింగ్ వైపు ప్రోత్సహించాలన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. అలాగే ఈనెల 6 నుంచి కాకినాడ పట్టణంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి స్కేటింగ్ పార్కులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించాలన్నారు. డాక్టర్ రాజేష్, స్కేటింగ్ సీఈఓ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.